# వారసులు

"ఈ అపరాత్రివేళ ఎక్కడికిరా బయల్దేరావు రాజా ?"

మొలలో ఓ వేపు బాకూ, మరోవేపు పిస్తోలూ, పైకి కనిపించ కుండా జాగ్రత్త చేసుకుని, పార్టీ మీటింగుకు హాజరవటానికి బయల్దే రుతూ, పాంటు హుక్స్ సరిగా పెట్టుకుంటున్న రాజా, చిరాగ్గా ఆ ముసలి తాత వంక చూశాడు.

మంచంలో పక్షవాతంతో పడివుండి.... ఏ క్షణాన్నయినా రాలిపోవ టానికి సిద్ధంగా వున్న శతాధిక వృద్ధుడు గోపన్న.

"ముసలి పీనుగ ! అడగనే అడిగాడు బయల్దేరేవేళ ! ధూః !" లోలోపల విసుక్కున్నాడు. జవాబివ్వకూడదనుకున్నాడు కానీ, లోలోపలి పొరల్లోని మమతానుబంధమేదో అప్రయత్నంగా జవాబిచ్చింది. "కాస్త పనుందిలే తాతా !"

"ఏమిటా పని ? ఏదో దోపిడీయో, హత్యో, దానికి ప్లాన్ అయి వుంటుంది అవునా ?" నెరసిపోయిన కనుబొమలు వికృతంగా ముడి పడగా, పిశాచంలా కనిపించాడు గోపన్న. క్షణకాలం పట్టుబడిన దొంగలా గిజగిజలాడినా, మరుక్షణం అది కప్పిపుచ్చుకుని తీక్ష్ణంగా అరి చాడు రాజా. "అబబ్బ ! నీకన్నీ అనుమానాలే తాతా ! నీకెందుకు అన్ని ఆరాలూ ! కృష్ణా! రామా! అంటూ పడుకోరాదూ ! ఓ వేపు చావు దగ్గరకు వస్తున్నా...." అతగాడి మాటలు పూర్తికాకుండానే గోపన్న నవ్వాడు.

"నా చావు దగ్గరకొస్తోందని నాకు తెలుసు కాబట్టే నీకో మంచి మాట చెబుదామని.... చివరిసారిగా నీతో చాలా చాలా చెప్పాలని...."

"అదేదో రేప్పొద్దున చెప్పొచ్చులే. నాకు పైమయిపోతోంది ?" హడావుడిగా జవాబు కాశించకుండా, అసహనంగా అరచి బయటికి.... ఆ చీకటిలోకి వెళ్ళిపోయాడు రాజా.

గోపన్న నిట్టూర్చాడు "రేపటికి నేనుంటానో వుండనో నువ్వెలా.... ఏ పరిస్థితిలో ఏ ప్రమాదంలో వుంటావో....వెళ్ళు....వెళ్ళు, నీ లోని ఉడుకురక్తం నిన్నిలాగే తరుముతుంది....ఆ నాడు నన్నూ తరిమింది.... చాలా చాలా చెప్పాలి. ఎలా ?" ఆ వృద్ధుని హృదయం ఏదో ఆరాటంతో వేగిపోతోంది, లోపల నిలువక, లావాలా సెగలు చిమ్ముతోంది. శూన్యంగా వున్న ఆ చిన్న చీకటిగదిలో పైకప్పు, నులకమంచం, పాత టేబిలూ కొద్దిపాటి పాత్రసామానూ, ఆ వృద్ధుడి హృదయం చెబుతున్న కథను, వ్యథను శ్రద్ధతో వింటున్నాయి.

* * * * *

ఆ రోజుల్లో, ఇంకాదేశానికి స్వాతంత్ర్యం రాలేదు. కానీ స్వాతంత్ర్య కాంక్ష ప్రతిఒక్కరిలో అణువణువునా ప్రజ్వరిల్లి వుంది. విప్లవాలు తలెత్తటం....అణచబడటం...."ఇదిగో ఇస్తాం, అదిగో ఇస్తాం" అంటూ ఊరిస్తున్న తెల్లదొరలూ .... అప్పుడప్పుడే కాంగ్రెస్‌లో ఏర్పడిన చీలికలూ, జస్టిస్ పార్టీ....'పొలో' మంటూ ఆడ, మగ, వృద్ధులు, పిల్లలు తేడాలేకుండా జైళ్ళకు వెళ్ళటం! ఉడుకురక్తం ఉరకలు వేస్తున్న గోపన్నలో స్వాతంత్ర్య పోరాటంలో పాలుపంచుకోవాలన్న ఆరాటం ఒకదానివెంట ఒకటిగా సాగుతున్నాయి.

ఆసరికే గోపన్నకు పదేళ్ళ కొడుకు ఆంజనేయులున్నాడు. గోపన్న తమ్ముడు సీతన్నకు కొత్తగా పెళ్ళయింది! ఆరెకరాల బంగారం పండే మాగాణీ, రెండు ఇళ్ళు, రెండు గాండ్లఎద్దులూ, ధనమూ, ధాన్యమూ,

సిరీ, సంపదతో చెప్పుకోదగ్గ స్థితిలోనే వున్నాడు గోపన్న. అన్నదమ్ము లిద్దరూ రామలక్ష్మణుల్లా స్వాతంత్ర్య పోరాటంలో దూకారు.

అప్పుడే చిన్న జమీందారు మాణిక్యరావుగారు జమీ వ్యవహారాలు చేపట్టి, మకుటంలేని మహారాజులా భోగభాగ్యాలతో తులతూగుతున్నారు. ఆయనగారి కొడుకు పద్మనాభరావు కూడా ఇంచు మించు ఆంజనేయులు వయసు వాడే. పెద్ద జమీందారుగారు (మాణిక్యరావు తండ్రి) మాత్రం స్వాతంత్ర్య పోరాటానికి అట్టే సుముఖంగా వుండేవారు కారు. జస్టిస్ పార్టీలో వుంటూ.... రావుబహదూర్ బిరుదులు సంపాదించారు.

మాణిక్యరావు మాంచి హుషారైనవాడు, ఆలోచనాపరుడు. గోపన్న లాటి యువకులందరినీ పోగుచేశాడు. "నా సర్వస్వం ఈ పోరాటానికి ధార పోస్తాను. నాదేశానికి స్వాతంత్ర్య తేవటమనే యజ్ఞంలో నేను ఓ సమిధగా మారుతాను" అంటూ గంభీరంగా చెబుతుంటే!

"మేమంతా మీ అండగా నిలుస్తాం, నిప్పుల్లోనయినా దూకుతాం!" అన్నారు గోపన్న, సీతన్న వగైరాలంతా! మాణిక్యరావు కాంగ్రెస్‌పార్టీకి నాయకత్వం వహించాడు. జస్టిస్ పార్టీ మీద దుమారం లేపాడు. దేశ స్వాతంత్ర్యం కోసం తండ్రినే ఎదిరించాడన్న ఆశ్చర్యం .... ప్రజలు కథలుగా చెప్పుకోవటం సాగించారు. జమీందారే డబ్బు మంచినీళ్ళలా ప్రవహింప చేశాడు. చివరకు మాణిక్యరావు భార్య మూడో బిడ్డను... ప్రసవవేదన పడుతోందనీ, ప్రసవం కష్టమయ్యేలా వుందనీ కబురు తెలిసినా, మాణిక్యరావు "నా దేశం తర్వాత నా కన్నీనూ!" అంటూ ఇంటికి వెళ్ళలేదు.

అతగాడి ఆ కార్యదీక్ష చూస్తూ గోపన్న పరవశించి పోయాడు. సత్యాగ్రహ సమర వీరులతో.... రాజకీయ చర్చాదురంధరులతో గోపన్న ఇల్లు పెళ్ళి ఇల్లులా మారిపోయింది. అందరికీ భోజనసదుపాయాలు చూచే

బాధ్యత నె త్తిన వేసుకున్నాడు. సేద్యం మూలపడింది, ఖర్చు ఎక్కువ యింది ! ఏదో ఆవేశం....మరేదో ఆనందం.... భాషాతీతమైన పొంగు.... ఎకరా ఎకరా అమ్మకానికి పెట్టడం....ఆ డబ్బుతో భోజన సదుపాయాలు !

మాణిక్యరావు కాంగ్రెస్ పార్టీ నాయకునిగా ఎన్నికయ్యాడు. మాణిక్యరావు జైలుకు వెళ్లాడు....గోపన్న వగైరాలు కూడా లాఠీదెబ్బలకు గురై జైలుకు వెళ్లారు.

జైల్లోపడిన మరునాడే....మాణిక్యరావును అన్ని వసతులుగల ఫస్ట్ క్లాస్ "ఇంప్రిజన్‌మెంటు"లో పెట్టారు. ఆయనకు యింట్లో వున్నన్ని సౌకర్యాలూ కలుగజేశారు. గోపన్న థర్డ్‌క్లాస్ జైల్లో....మామూలు ఖైదీలతో బాటువుంటూ ఎంతో ఆనందించాడు, "మానాయకుడు సుఖంగా వున్నాడు.... అంతేచాలు. నాయకుడు క్షేమంగావుంటేనే ఏ పోరాటమైనా జయప్రదంగా సాగేది !" అనుకున్నాడు. సీతన్న మాత్రం గుసగుసగా అన్నాడు. "పెద్ద జమీందారుగారు (మాణిక్యరావు తండ్రిగారు) తెల్లదొరలతో మాట్లాడి.... తన కొడుక్కేమీ బాధలేకుండా వుండే ఏర్పాటుచేశారట.... " అన్నాడు. గోపన్న కసిరికొట్టాడు. "ఛస్ ! అవేంమాటలు ! తండ్రీ కొడుకులకు చుక్కెదురు! తండ్రిది తెల్లదొరలకు మద్దతు ఇచ్చే పార్టీ....కొడుకునిజంగా మాణిక్యమే ! తెల్లదొరల మీద తిరుగుబాటు చేసే కాంగ్రెసు పార్టీ ఈయనది...."

"....అవన్నీ ఎట్లా వున్నా తండ్రి పలుకుబడితో.... " సీతన్న ఇంకా ఏదో చెప్పబోతుంటే, గోపన్న కసిరి పారేశాడు "ఛస్ ! వెధవ మాటలు మాట్లాటకు ! మనకు నాయకత్వం వహిస్తున్న ఆయన మనకు దేవుడు — అంతే."

మాణిక్యరావు వారంరోజుల్లోనే విడుదలైనాడు; స్వాతంత్ర సమరయోధునిగా జిల్లా అంతటా సన్మానాలందుకున్నాడు. ఈవిషయాలన్నీ

జైల్లో వున్న గోపన్న విని ఎంతో సంబరపడ్డాడు. జైలు బయటికి వచ్చే సరికి మాణిక్యరావు కాంగ్రెసు మంత్రిగా ఎన్నికైనాడు.... తన పొలం అంతా అమ్ముడుపోయి.... ఒక్క పెంకుటిల్లు మాత్రం మిగిలింది.

స్వాతంత్ర్యం వచ్చేసింది! అందుకోసం కలలు కన్న మహావీరులూ, త్యాగులూ, చాలామంది ఆసరికే మట్టిలో కలసిపోయారు. మిగిలిన కొద్ది మందీ.... అలసిపోయి ఉన్నారు. మాణిక్యరావు ప్రభ వెలుగుతోంది. గోపన్నలాటి యువకులెందరో తెరమరుగయ్యారు.

మాణిక్యరావు చాలాచాలా సంపాదించాడు. స్వాతంత్ర్యపోరాటంలో ఖర్చు అయిందనుకొన్న మొత్తానికి పదింతలు సంపాదించాడనుకుంటున్నారు జనం. గోపన్న కెంచేతో మాణిక్యరావుమీద అలాటి నింద పడటం బాగాలేదు.

"తమరిమీద లోకులు నింద వేస్తున్నారు.... డబ్బు బాగా సంపాదిస్తున్నారని....ప్రజాసేవ....దేశసేవ....మరచిపోయారనీ...." అన్నాడో రోజు దగ్గరలో ఎవరూ లేకుండా చూచి మాణిక్యరావుతో! ఆ వొక్క ఇల్లూ కడుపునింపటం లేదు కాబట్టి, మాణిక్యరావు దగ్గర "తలమనిషి"గా అన్ని పనులు చూచుకుంటున్నాడు గోపన్న. మాణిక్యరావు మృదువుగా నవ్వాడు "ఆ సమయంలో.... మీ అమ్మగారు ప్రసవవేదన పడుతున్నా లక్ష్యంచేయక....దేశసేవ చేయలేదూ నేను"?

"ఈనాడు దేశ సమస్య తీరింది. స్వాతంత్ర్యం వచ్చేసింది! ఇక దేశానికి నేను చేయవలసిందేమీ లేదు.... ఇప్పుడయినా నా కుటుంబ శ్రేయస్సు చూచుకోనవసరం లేదూ? జమీందార్ల వంశం మాది. జమీందారీలు ఎలాగూ రద్దయిపోయాయి. భుక్తికీ, మా ప్రతిష్టకూ, నౌకర్ల సంరక్షణకూ కావలసినంత డబ్బేనా సంపాదించుకోవాలా వద్దా! అదీ

తప్పేనని నువ్వంటే....ఏదీ నీ గుండెమీద చెయ్యి వేసుక చెప్పు.... తప్పని....మానేస్తాను సరా" ?

గోపన్న అవాక్కుగా నిల్చుండిపోయాడు. మాణిక్యరావు చెప్పిన దాన్లో బేసబబేమీ కనిపించలేదు.

కాలం గిర్రున తిరుగుతోంది.

"గోపన్నా ! చూశావా ! మొన్నను మేమంతా తీర్మానం చేశాం ! గ్రామ కరణాలకూ, మునసబులకూ, వెట్టి, ముదాముల్లాటి గ్రామస్థాయి ఉద్యోగులెవరికీ, ఇక ముందు ముందు వారసత్వం వుండదు ఉద్యోగ విషయంలో! అర్హతనుబట్టి ఎవరికైనా వస్తాయి ఆ ఉద్యోగాలు ఇకమీదట. అంతేగానీ వారసత్వం ప్రకారం రావు. ఈ రోజే అది ఆమోదింపబడినట్లు వార్తలు వచ్చేశాయి చూడు" అన్నాడు మాణిక్యరావు ఓ రోజు.

ఏదో కబురు ఆవేశంగా చెబుదామని వచ్చిన గోపన్న ఆ కబురు మర్చిపోయి....అర్థంకాని ఆనందంలో తల మునకలయ్యాడు. ఇకముందు తరతరాలూ ఒక వంశంలోని వారే గ్రామ కరణాలుగా, మునసబులుగా చెలామణీ కావటం కుదరదు ! దొంగశిస్తు వసూళ్లూ, దొంగపట్టాలూ.... బెదిరింపులూ, వారి ఆగడాలు ఇకసాగవు. ఆహాఁ ! ఎంత మంచి మార్పు! ఎంత గొప్ప చట్టం !

"ఊఁ ! ఏదో పనుండి వచ్చినట్టున్నావ్ ?" అన్నాడు మాణిక్యరావే....ఆలోచిస్తున్న గోపన్నను ఇహ లోకంలోకి తెస్తూ.

"అహాఁ ! ఏం లేదు....పెద్దబ్బాయిగారు....పద్మనాభరావుగారు.... కుర్రకారునంతా పోగుచేసి.... "కమ్యూనిస్టు పార్టీకి జై" అంటూ అరుస్తున్నారు. నిప్పులాటి మా సీతన్నగాడి మనసుకూడా మారిపోయింది. మనముందే....మన తర్వాతి తరం వారు, మన సిద్ధాంతాలను మన్నుపాలు

చేస్తే...." గోపన్న మాట పూర్తికాకముందే మాణిక్యరావు "ఇక చెప్పొద్దు" అన్నట్టు అసహనంగా సైగచేశారు. క్షణకాలం గంభీరంగా కూర్చున్నారు. తర్వాత మెల్లిగా అన్నారు "గోపన్నా! మన కాలానికి మన సిద్ధాంతాలు సరిపోయినయ్! మా అబ్బాయి తెలివితక్కువ వాడేం కాదు.... నా అంతవాడైనాడు. వాడిష్టం. నేను చెప్పటం అంత బావుండదు. చెప్పినా వింటాడన్న నమ్మకం నాకు లేదు. ఈ తరమే ఇంత నువ్వేం బాధపడకు! సీతన్న చెడిపోతున్నాడనా నీ బాధ! నాలుగు బొప్పులు కడితే, అతగాడే స్థిమితం నేర్చుకుంటాడు. ఏమంటావ్!"

గోపన్న మాట్టాడలేదు. ఎంచేతో మొదటిసారి డబ్బు అక్రమంగా సంపాదించటం గురించి మాణిక్యరావు ఇచ్చిన సంజాయిషీలా, ఇది నచ్చలేదు.

ఒక మనిషి, జీవితములో ఒక సిద్ధాంతానికి కట్టుబడి వుండనవసరం లేదా? ఆలోచించి చూస్తే, పద్మనాభరావు కమ్యూనిస్టుల్లో చేరటం .... వెనక మాణిక్యరావు ప్రోత్సాహమే ఎక్కువగా ఉన్నట్లు మనసుకుతోచింది గోపన్నకు.

సంవత్సరం తిరిగేసరికి, పద్మనాభరావు కమ్యూనిస్టు పార్టీ నాయకునిగా బాగా పేరు తెచ్చుకున్నాడు. సీతన్న పద్మనాభరావుకు "తోక"లా తిరుగుతున్నాడేగానీ అతగాడి కేలాటి విలువా రాలేదు.

పద్మనాభరావు ప్రభ వెలిగిపోతోంది. కమ్యూనిస్టు పార్టీలో మళ్ళీ రెండు చీలికలు. హింసాయుతమైన సాయుధ పోరాటం—దేశంలో పెరిగిపోయిన అవినీతి, పదవీ వ్యామోహం, గుత్తాధిపత్యం—నిరుద్యోగం—వగైరా సమస్యలకు పరిష్కారం—సాయుధ విప్లవంతోనే సాధించాలని పద్మనాభరావు తరచూ లెక్చర్లిస్తున్నాడు! అండర్ గ్రౌండ్ సమావేశాలు ఏర్పాటు చేస్తున్నాడు! పార్టీ ఫండ్స్ ముమ్మరంగా వస్తున్నాయి.

మాణిక్యరావు తాను "రాజకీయ అస్త్రసన్యాసం" చేస్తున్నట్లు ప్రకటించాడేగానీ.... కొడుకు మీద ఈగ వాలకుండా కట్టుదిట్టాలు చేసుకుంటున్నాడు.

గంతకట్టిన ఎద్దులా ఎగిరిన సీతన్న అరెస్టయ్యాడు....పద్మనాభరావు కూడా అరెస్టయ్యాడు గానీ .... ఎంచేతో అతగాడు చేసిన నేరాలేవీ లేవని రుజువైంది. సీతన్న జాడ మరి తెలియలేదు. బ్రతికి వున్నాడో.... చనిపోయాడో, గోపన్న కొడుకు ఆంజనేయులు మాత్రం తండ్రి అడుగు జాడల్లో నడిచాడు....కానీ అతగాడి "వంశం" చెప్పుకోదగ్గ "దేశసేవకుల" జాబితాలోకి రాలేదు కాబట్టి — అతగాడి కొట్టే చదువు సంధ్యలూ, రాజకీయ చతురతా, నాయకత్వ లక్షణాలూ లేవు కాబట్టి, వుట్టినే ఆంజనేయులుగానే మిగిలిపోయాడు. మిగిలివున్న ఒక్కకొంపా తాకట్టులో పోయింది. ఆంజనేయులుకు కలెక్టరాఫీసులో బంట్రోతు నౌకరీవచ్చేందుకు, ఆ జిల్లాలో గోపన్న పట్టుకోని కాళ్ళులేవు! దారిద్ర్యమూ, నీరసమూ తోడై ....ఆంజనేయులు అనారోగ్యపు అర్భకుడుగా తయారైనాడు, అతగాడి భార్య రాజాను ప్రసవించి చనిపోయింది! రాజాకు ఆరేళ్లు నిండుతుండగా — ఆంజనేయులు క్షయతో —చనిపోయాడు.

పద్మనాభరావు ఆట్టే ఎక్కువ సంపాదించలేదు. ఏదో ఉడతాభక్తిగా రెండు కార్లూ, ఆరు బంగళాలూ, రెండు ఫ్యాక్టరీలూ, ఓ సినిమాహాలూ, మరేదో విదేశీ కంపెనీల్లో షేర్లూ, విదేశీ బ్యాంకుల్లో కొద్దిపాటి "ల" కారాల అకౌంటూ మాత్రమే తనకుగా మిగిలించుకో గలిగాడు! అపోజిషన్ పార్టీలో ప్రముఖుడిగా గడగడలాడించేస్తున్నాడు." అవునుమరి! వారి వంశంలోని రక్తమే అంత! వారి తాతగారు మొదలుకొని—దేశసేవకులే. తండ్రి స్వాతంత్ర్య సమరంలో "సర్వస్వం అర్పించిన త్యాగి".

నిజానికి పద్మనాభరావుగారికి — దేశమాత ఇంకా ఎంతో ఋణపడి వుంది !" అంటున్నారు కొందరు మెప్పుదలగా !

కాంగ్రెసులో ఎన్నో చీలికలు — సోషలిస్ట్ — కమ్యూనిస్ట్ — జన సంఘం.... స్వతంత్ర — నక్సలైట్....

రెండుపార్టీలు కలిసి రేపో కొత్తపార్టీ !

మూడు పార్టీలు చీలి ఎల్లుండి నాలుగు కొత్తపార్టీలు — ఈరోజు ఓపార్టీ నాయకుడు, రేపే పార్టీ లీడరుగా మారుతాడో — పుట్టించిన బ్రహ్మకు కూడా తెలియటంలేదు !

పద్మనాభరావుగారి తమ్ముడు కళ్యాణరావు.... నక్సలైటు పథం మంచిదన్నాడు ! అపుడప్పుడే నూనూగుమీసాల వయసులోకి వస్తున్న, ఆంజనేయులు కొడుకు రాజాకూడా నక్సలైట్‌గా మారాడు !

నడ్డి వంగిపోయిన గోపన్న నిరసనగా మనవడివేపు చూశాడు. "రాజా ! ఎందుకిలా నిప్పుల్లోకి దూకుతావ్ ! బాగా చదువుకో ! ఏదేనా నౌకరీ చూచుకో ! లేదా వొళ్ళువంచి పనిచేసుకుని బ్రతుకు ! ఈ రాజకీయాలు — నిలకడలేనివి ! మీ చిన్నాన్న బలైపోయాడు ! మీ నాన్న — నా తెలివితక్కువ తనానికి.... నా దూరదృష్టిలేని చవటతనానికి.... చని పోయాడు. నువ్వా...."

ఛర్రుమన్నాడు రాజా. "దేశభక్తుడినంటూ కబుర్లు చెబుతావ్ ! నీ దేశభక్తి ఇదేనా తాతా ? నేనూ నా సాటి ప్రజలకోసం ఏమీ చేయనవసరం లేదా ?"

"నువ్వేమీచేయలేవు ! నువ్వు మాణిక్యరావు లాటి "దేశభక్తుల" వారసుడివి గానీ, వంశంలోవాడివి గానీ కావు, కాబోవు. నిన్ను ఇటు ప్రజలుగానీ, అటు ఏ పార్టీ గానీ, ప్రభుత్వంగానీ గుర్తించదు—"

రాజా చీదరించుకుని వెళ్ళిపోయాడు.

కళ్యాణరావు వెంట సభలకూ అజ్ఞాతచర్చలకూ పరుగు తీస్తున్నాడు రాజా! అలాటి మరెందరో యువకులూ అలాగే ఊగిపోతున్నారు!

హఠాత్తుగా ఓ సుప్రభాతాన....పద్మనాభరావు—తను కమ్యూనిస్టు పార్టీకి రాజీనామా ఇస్తున్నట్లు ప్రకటించాడు. కారణం ఆ పార్టీ సిద్ధాంతాలు తనవంటికి సరిపడలేదనీ, అంతరాత్మకు విరుద్ధంగా వున్నాయనీ—తను ప్రభుత్వ కాంగ్రెస్‌లోనే చేరుతాననీ— నమ్మిన బంటులా వుంటాననీ చెప్పేశాడు; అన్ని ప్రముఖ పత్రికలూ ఈ వార్త ప్రకటించాయి.

"విశ్రాంతి" తీసుకుంటున్న మాణిక్యరావు గర్వంగా మీసాలు సవరించుకున్నారు. "మాది దేశభక్తుల వంశం!" అన్నట్లు నవ్వారు. నెల తిరక్కుండానే పద్మనాభరావు ప్రముఖమైన పదవిలో స్థిరపడి పోయాడు!

అదేంచిత్రమో ఎక్కడ కళ్యాణరావు రహస్య సమావేశం ఏర్పాటు చేసినా-పోలీసులు ఆ స్థావరంమీది దాడి చేస్తూనేవున్నారు. ఎందరో శిక్షింపబడుతున్నారు. "ఘర్షణ"లో కాల్చివేయబడుతున్నారు. కానీ కళ్యాణరావు మాత్రం పట్టుబడటం లేదు. పద్మనాభరావు పలుకుబడి అతగాడి చుట్టూరా ఉక్కుకవచంలా వుందని చాలామంది ఆవేశ పూరితులైన (ఆలోచన తక్కువైన) యువకులకు తెలియదు.

పాకుతున్నట్లు నడుస్తూ గోపన్న పద్మనాభరావు దగ్గరికి వెళ్ళాడు. గోపన్న అంటే తన తండ్రి దగ్గర పనిచేసిన వాడన్న గౌరవం కొంత వుంది పద్మనాభరావుకు.

"ఈ రాజకీయ సుడిగుండంలో అభం శుభం ఎరుగని యువకులు-బలౌతున్నారు.మీ తమ్ముడిగారికి కాస్త నచ్చచెప్పి ఈపూనకం వదిలించండి-

తరానికో పార్టీ అవటం తమ వంశానికే అప్రదిష్ట ?" అన్నాడు గోపన్న. మనవణ్ణి కాపాడుకోవటం ఎలా అన్నదే అతడి ప్రధాన సమస్యగా వుందిప్పుడు.

"ఏం చెయ్యను గోపన్నా, కుర్రకారు బొత్తిగా చెడిపోతున్నారు! రేపొద్దున ఆ పార్టీయే ప్రభుత్వంగా మారుతుందో ఏమో ! ఎలా చెప్ప గలం....! కానీలే ! చెప్పి చూస్తాను !" అన్నాడు పద్మనాభరావు కొంత స్వగతంలా, మరికొంత పెదగా.

పద్మనాభరావు చెప్పి చూడలేదు. చేసి చూపాడు. కళ్యాణరావును "పెద్ద చదువుల" మిషమీద విదేశాలకు పంపేశాడు కొన్నాళ్ళపాటు.

ఆరు నెలలు గడిచేసరికి - కళ్యాణరావు అక్కణ్ణుంచి అన్ని ప్రముఖ పత్రికలలోనూ గొప్ప గొప్ప ఇంగ్లీషు వ్యాసాలు వ్రాయటం మొదలెట్టాడు - "మన దేశాన్నీ.... దేశంలోని సమస్యల్నీ, సంస్కరించ టానికీ, పరిష్కరించటానికీ "హింస" పనికిరాదనీ - మనమంతా బుద్ధుని వారసులమనీ, అహింసే మన ఊపిరి అనీ -"

"దేశంలో అసలు ఇన్ని పార్టీలు అనవసరమనీ, ప్రభుత్వం నడప డానికి ఒకే ఒక పార్టీ చాలనీ.... ఆ ఒక్కపార్టీయే ఏ అభ్యుదయమైనా సాధించగలదనీ.... అదే తన పార్టీ (ప్రస్తుతం !) అనీ" — సీరియల్‌గా ఒక్కోవారం ఒక్కోఅంశంగా వ్రాశాడు. అది చదివిన అతని అనుచరులు మూర్ఛపోయారు గానీ పద్మనాభరావు ముసి ముసిగా నవ్వుకున్నాడు. చిన్న సభలాటిది జరిపి — తన తమ్ముడిలో వచ్చిన ఈ పరివర్తనకూ అభ్యుదయ ధోరణికీ - యావద్భారతమూ ఉత్సవాలు జరుపుకోవాలన్నంత ఆనందంతో ఉపన్యసించాడు. వింటున్న "పెద్దలు" కూడా కళ్యాణరావు అంతకు క్రితం చేయించిన హత్యలూ, దోపిడీలూ - వగైరాలేవీ.... లెక్క చేయవలసిన నేరాలేమీ కాదన్నారు. పార్టీ మార్పిడితో అతగాడు

పునీతుడై పోయాడన్నారు. అసలలాటి ఉన్నత ఆశయాలుగల "యువకులే" ఈనాడు దేశానికి అవసరమన్నారు ! అతగాణ్ణి త్వరగా ఇక్కడికి పిలిపించి మంచి పదవి సృష్టించి, సత్కరించాలని కూడా తీర్మానించారు. మాణిక్యరావు మాత్రం "భారవి" తండ్రిలా.... చిన్న కొడుకు తెలివి తేటల్ని పైకి ఎక్కువగా పొగడకుండా, "ఏదోలెండి ! నా వారసులు.... దేశసేవ చేస్తే అంతే చాలు !" అన్నాడు గంభీరంగా....పెద్దరికంతో !

ఆ ఆరునెలల్లో... కళ్యాణరావుతో బాటు లోగా అతగాడి సిద్ధాంతాలను అమలు జరపాలన్న యువకులు, ఆవేశంతో "సమత" సాధించాలన్న తొందరపాటుతో....కార్యసాధనకు బూనుకున్నారు. ఫలితంగా చాలా మందికి "యావజ్జీవ కారాగార శిక్షలు" వేయబడ్డాయి. కొందరు మరో లోకంలోకి తరలి వెళ్ళారు. ఇంకా కొందరు అజ్ఞాతవాసంలో వున్నారు. ఏ క్షణాన్నయినా వారికి ఆయువు మూడవచ్చు. లేదా బేడీలు తగిలించవచ్చు ! రాజామీద కూడా "నిఘా" వుందని తేలిపోయింది చాలామందికి. అ సంగతి గోపన్నకు తెలిసిన మరుక్షణం....నూరేళ్లు నిండిన అతగాడి శరీరం బాధతో, భయంతో పక్షవాతం పాలయ్యింది !

* * * * *

ఆ రాత్రి .. ఆ చీకటిరాత్రి రాజాకవన్నీ చెప్పాలన్న ఆరాటంతో, మెలికలు తిరిగిపోతున్నాడా వృద్ధుడు.

"దేశానికీ, పదవులకూ, వారసులు మాణిక్యరావులాటి....పద్మనాభరావూ, కళ్యాణరావూ వారి వారి బిడ్డలేరా రాజా ! సిద్ధాంతాలనూ, పార్టీలనూ, తృణప్రాయంగా మార్చగలిగినవారే, తామొక పదవిలోకి ప్రాకిపోగానే, తమ బిడ్డలకు మరో పదవీ, సంపదా, సిద్ధం చేయగల వారే నిజమైన దేశభక్తులురా రాజా ! ఈనాడు ! చిన్న చిన్న ఉద్యోగులకు

వారసత్వపు హక్కు తొలగించినవారే, తమ పదవుల విషయంలో తరతరాల వారసత్వపు హక్కును పొందగలిగిన నిపుణులు!

"నువ్వా మారివో! పదవులు రాకుంటే పీడాపోయే! దిక్కులేని చావో.... శిక్షో పడదు. అంతే చాలు!"

ఆ రాత్రే.... ఆ చీకటిరాత్రే కళ్యాణరావు విదేశాలనుంచి వచ్చాడు. ఘనస్వాగతం తర్వాత.... అతగాడి మూడంతస్థుల బంగళాలో ఏర్ కడిషన్డు రూంలో పద్మనాభరావు మృదువుగా నచ్చచెబుతున్నాడు. "భేషైన పనిచేశావ్! కల్యాణ్! ఇక భయంలేదు. రేపే నీకై కేటాయించబడిన పదవిలో కుదురుకుంటావు. వెధవదేశం, వెధవ సమస్యలు....ఎలాపోతే మనకెందుకు? అన్నట్లు నా పెద్దబ్బాయి "తిలక్" కు ఇప్పట్నుంచే "రాజకీయ శిక్షణ" ఇవ్వాలి! ప్రభుత్వం ఏ పార్టీలో ఉంటే, వాడిదీ ఆ పార్టీనే కావాలి! సర్లే. అవన్నీ రేపు మాట్లాడుకుందాం! నీకు రాబోతున్న కొత్తపదవికి సంతోషసూచకంగా, ఏదీ....ఓ పెగ్....!" గాజు గ్లాసులు—బాటిల్సూ—నవ్వులూ—

తెల్లగా తెల్లారింది—

ఎప్పుడో కళ్యాణరావు పరోక్ష నాయకత్వంలో జరిగిన "హత్య" కేసులో....అనుమానితుడుగా పట్టుబడిన రాజాకు, ఏడేళ్ళపాటు సెంట్రల్ జైలు సెల్స్ సాదరంగా స్వాగతం పలికాయి....

("జయశ్రీ" ఆగస్టు 1973)